


మనం
మెదక్ | సంగారెడ్డి సిద్దిపేట
సోమవారం | 1 | జూన్ | 2026 | పేజీలు 6 | www.manamepaper.com


# జోరుగా బెల్ట్ షాపుల నిర్వహణ

పట్టించుకోని ఆప్కారి శాఖ అధికారులు

విచ్చలవిడిగా దుకాణాల నిర్వహణ

- చీప్ లిక్కర్ నుంచి అన్ని బ్రాండ్ల అమ్మకాలు
- కిరాణా దుకాణాల మాటున అడ్డగోలుగా దందా
- 24ల7 అందుబాటులో మద్యం
- చేసిన కష్టం తగలేస్తున్నారని కుటుంబాల ఆవేదన
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖాధికారులు

**సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో బెల్టు షాప్ ల జోరు సాగుతోంది. మద్యం ఏరులైపారుతోంది. గుడికి బడికి తేడా లేకుండానే బెల్టుషాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం సాగుతోంది. ఇక వైన్ షాపులు బార్లను తలపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం విక్రయించడంతో పాటు అధిక రేట్లకు అమ్మకాలు జరిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బెల్టుషాపు లేకుండా చేస్తామమని హామీ ఇచ్చారు.**

అక్కన్నపేట మే28 మనం న్యూస్ : అయితే మద్యం షాపుల యాజమానులకు టార్గెట్లు పేరుతో గల్లీకో బెల్టుషాపులను నిర్వహిస్తూ పగలు,రాత్రి తేడా లేకుండా ఒక్కొక్క మద్యం బాటిల్పై అదనంగా రూ.40 నుంచి 60 రూపాయలు వసూలు చేస్తూ మందు బాబుల జేబులు గుల్ల చేస్తున్నారు. దీనితో బెల్టుషాపుల దందా మూడు బాటిల్లు, ఆరు కాసులుగా తయారైంది. బెల్టుషాపులను అడ్డుకోవాలసిన ఎక్సైజ్ అధికారులు పట్టినట్లు వ్యవహరిస్తున్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో మూడు పూలు ఆరు కాయలుగా మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతుంది. బెల్ట్ షాపులు

- మిగతా 2లో..



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

## మంత్రి దామోదర రాజనర్సింహ

### మునిపల్లి, రాయికోడ్ మండలాలలో మంత్రి సుడిగాలి పర్యటన

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ పర్యటనలో మునిపల్లి మండలం బుధేర గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో సుమారు 6 కోట్ల 80 లక్షలతో నూతనంగా నిర్మించ తలపెట్టిన అకడమిక్ బ్లాక్ (24 తరగతి గదులు) నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కాలేజీ ప్రాంగణం లో క్షేత్ర స్థాయిలో పర్యటించారు.**

సంగారెడ్డి 31 మనం న్యూస్ ప్రతినిధి : గురుకుల మహిళా డిగ్రీ కళాశాల లలో మౌలిక సదుపాయాల కల్పన పై కాలేజీ ప్రిన్సిపాల్, ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల సొసైటీ నిధులతో పాటు ఎంఆర్ఎఫ్ సంస్థ సి ఎస్ ఆర్ నిధులతో ఈ అకడమిక్ బ్లాక్ ను నిర్మిస్తున్నామన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ . అనంతరం, మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామంలో ఉన్న తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ సొసైట్ సంస్థ స్కూల్, రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ లో గత సంవత్సరం కూలిపోయిన పాత భవన స్థలం లో సుమారు 11 కోట్ల రూపాయల నిధులతో నిర్మించ తలపెట్టిన అకడమిక్ బ్లాక్ నిర్మాణ స్థలాన్ని పరిశీంచారు. పర్యటన లో బాగంగా కంకోల్ రోడ్డు టోల్ గేట్ వద్ద తెలంగాణ టూరిజం ఆద్వర్యం లో 3

- మిగతా 2లో..

# ఇందిరమ్మ చీరలు పంపిణీ

## టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి




సంగారెడ్డి మే 31 మనం న్యూస్ ప్రతినిధి : సంగారెడ్డి పట్టణం లోని 22 వ వార్డ్ రామ్ నగర్ లో గ్రామైక్య మహిళా సంఘ సభ్యులకు నిర్మలా జగ్గారెడ్డి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. రామ్ నగర్, రామ్ మంధిర్ లోని ఆమె స్వగృహం లో, స్థానిక

# జోరుగా బెల్ట్ షాపులు

మొదటి పేజీ తరువాయి

పుట్టగొడుగుల్లా ఊరిలో వెలుస్తున్నాయి. ఆప్కారి అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు అని మందుబాబుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుక్క. ముక్క..కిక్కు. పల్లెల్లో నేడు ట్రెండ్‌గా మారిపోయింది. వేకువజాము మొదలు.. అర్ధరాత్రి వరకు.. చీప్ లిక్కర్ నుంచి కాస్ట్లీ మందు వరకు.. ఏ బ్రాండ్ కావాలన్నా.. కేరాఫ్ బెల్ట్‌షాపులుగా పరిస్థితి తయారైంది. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే బెల్ట్‌షాపుల ఊసే లేకుండా చేస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నేతలు నేడు అధికారంలోకి వచ్చాక మద్యం ధరలు పెంచడంతోపాటు విచ్చలవిడిగా పేద, సామాన్య మందుబాబుల 'బెల్ట్' తీస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

మొదటి పేజీ తరువాయి

ఎకరాల విస్తీర్ణం లో సుమారు 25 కోట్ల రూపాయలతో నిర్మించ తలపెట్టిన ప్రతిపాదిత హరిత హోటల్, కన్వెన్షన్ సెంటర్ స్థలాన్ని పరిశీలించారు. మునిపల్లి మండలం లోని గార్లపల్లి – తక్కడపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం హస్నాబాద్, ఇందురు, కర్చల్, బుధేర, సీలూర్ రోడ్డు పరిశీలించారు. ముక్త క్యాసారం – తాటిపల్లి, రాయికోడ్ మండలం కోడూరు నుండి సింగీతం గ్రామం వరకు నిర్మిస్తున్న డబుల్ రోడ్డు ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ గిరిధర్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ పాండు, ఇంజనీరింగ్ అధికారులు, మునిపల్లి, రాయికోడ్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సతీష్ కుమార్, బాలాజీ నరసింహులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# 25వ సారి రక్త దానం చేసిన సీనియర్ అసిస్టెంట్ కిషోర్



సంగారెడ్డి మే 31 మనం న్యూస్ ప్రతినిధి : 25 వ సారి రక్త దానం చేసి మానవత్వం చాటుకున్నాడు సంగారెడ్డి కలెక్టరేట్ రెవిన్యూ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ బి. కిషోర్. ఆదివారం సంగారెడ్డి ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మహిళకు అత్యవసరంగా దీ పాజిటివ్ బ్లడ్ గ్రూప్ కావాలని డాక్టర్ చెప్పారు. దింతో కుటుంబ సభ్యులు బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణ కు సంప్రదించారు .. బంగారు కృష్ణ వెంటనే కలెక్టరేట్ రెవిన్యూ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ కిషోర్ ను రక్త దానం చేయాలని అడగానే తాను రక్త దానం చేస్తాను అని కంది సమీపంలో నీ బ్లడ్ బ్యాంక్ కు వచ్చి రక్త దానం చేసి మానవత్వం చాటుకున్నారు.. ఈ సందర్భంగా బంగారు కృష్ణ మాట్లాడుతూ రక్త దాత కిషోర్ 25 వ సారి రక్త దానం చేయడం రక్తం పై ఆయనకు ఉన్న చైతన్యనికి నిదర్శనం అని సన్మానం చేశారు.. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు రక్త దాతకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమం లో మల్లేశం, మధు పాల్గొన్నారు

# ఇందిరమ్మ చీరలు పంపిణీ

మొదటి పేజీ తరువాయి

కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యం లో ఈ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యం లోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతిగా ఉందని, ఏ ప్రభుత్వ కార్యక్రమం మొదలుపెట్టినా మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తుందని, గత ప్రభుత్వం లో పంపిణీ చేసిన చీరలను పొలాల వద్ద బెదురు కోసం వాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్ రెడ్డి, వార్డు పెద్దలు కల్పన తదితరులు పాల్గొన్నారు.



# భగవంతునిపై భక్తి ఉంటే చాలు

## ఆశిష్ కృష్ణ శాస్త్రి మహారాజ్



జహీరాబాద్ మే 31 మనం న్యూస్: భగవంతునిపై పరిపూర్ణమైన భక్తి, నమ్మకంతో శరణుజొచ్చిన వారిని ఆపత్కా లంలో దేవుడు తప్పక కాపాడు తాడని శ్రీధాం, బృందా వనం గురువర్యులు ఆశిష్ కృష్ణ శాస్త్రి మహారాజ్ వ్యాఖ్యానించారు. భగవంతునిపై భక్తి కలిగి ఉన్న భక్తుడికి ఏ లోటు ఉండదని ఆయన చెప్పారు. శ్రీమద్భాగవత్ కథా సప్తహాలో భాగంగా జహీరాబాద్ లోని వాసవి కల్యాణ మంటపంలో ఆయన అనుగ్రహ భాషణం చేశారు. దృఢమైన భక్తి, సత్యం వైపు నిలిచేవారికి భగవంతుని రక్షణ ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. మనిషి సదా సత్యమార్గాన్నే కొనసాగించాలని హితవు పలికారు.భగవంతునికి భక్తి ప్రధానమే కానీ, ఇచ్చే కానుకల విలువ కాదని, స్నేహానికి కుల, మత, ధనిక, పేద భేదాలు లేవని పరమాత్మ ఐన శ్రీకృష్ణుడు కుచేలుని పట్ల చూపించిన ప్రేమనే నిదర్శనమని ఆయన గుర్తు చేశారు. కఠినమైన దీక్ష, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని వివరించారు. ఉత్తానపాదుని చిన్న కుమారుడైన ధ్రువుడు, సవతి తల్లి మాటల వల్ల అవమానపడి అడవికి తపస్సు చేయడానికి వెళ్లాడని, నారదుని ఉపదేశంతో చిన్న వయస్సులోనే శ్రీహరి కోసం కఠినమైన తపస్సు చేసి, విష్ణుమూర్తి అనుగ్రహాన్ని పొంది ధ్రువ మండలంగా స్థిరపడిన విషయాన్ని మహారాజ్ సోదాహరణంగా తెలియ జేశారు. గజేంద్ర మోక్షం, ప్రహ్లాద చరిత్ర, కుచేలుని వృత్తాంతం, ధృవోపాఖ్యానం, దశావతారాల గురించి భక్తులకు అర్థమయ్యే రీతిలో నాటక రూపకంగా తెలిపారు. బాంకే బిహారీ, శ్రీవామన, బలి చక్రవర్తి, శ్రీకృష్ణ జన్మోత్సవం, రుక్మిణి కళ్యాణం ఇత్యాది ఘటనలను కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఏడు రోజులపాటు కొనసాగిన శ్రీమద్భాగవత్ కథ అసాంతం భక్తులను మంత్రముగ్దులను చేసింది. ప్రతినిత్యం కథా ప్రవచనానికి ముందు, తరువాత నిత్య యజమానులైన కల్వ మోహన్, నీలా నాగేష్, కొబ్బాజీ మురళి, కొబ్బాజీ రవి కుమార్, అజయ్ దత్ న్యాల్కల్కర్, ప్రేమ్ సింగ్ రాథోడ్, అనిత శాస్త్రి, గిరిధర్ లాల్ జాజు, ముప్పిడి సాయిరాం, బుల్లెయ్ రాజు, నంద్ కిషోర్ పల్లోడ్, ఉమా జాదవ్, మునిసిపల్ కౌన్సిలర్ నామా ప్రవంతి రవి కిరణ్, సునీల్ సంకల మొదలగు వారిచేత ఆరతి కార్యక్రమం నిర్వహించి పుష్పాంజలి కార్యక్రమం నిర్వహింపజేశారు. కాగా కథా ప్రవచనం లో బృందావనం నుండి విచ్చేసిన సంగీత కళాకారులు ఆశిష్, ప్రద్యుమన్, లలిత్, కృష్ణ, ఆనంద్ లు వాద్య సహకారాన్ని అందించగా సోమేంద్ర తివారి, రోహిత్ మిశ్రా, వినయ్ శాస్త్రి, అరవింద్ బాబాజీ, సునీల్ పాండే పూజా క్రతువులను పూర్తి చేశారు. ఇక్కడ గత వారం రోజులపాటు కొనసాగిన ఈ కార్యక్రమానికి స్థానిక హరేకృష్ణ మూమెంట్ బృందం, ఏకాదశి భజన మండలి, మహేశ్వరి మహిళా సమాజ్, ఆర్య వైశ్య సంఘం మహిళా మణులు, వివిధ సంఘాల బాధ్యులు ప్రతి రోజు విచ్చేసి కార్యక్రమం జయప్రదం చేసేందుకు దోహద పడ్డారు. సహయోగం అందించిన ప్రతీ భక్తుడికి ఆశిష్ కృష్ణ శాస్త్రి మహారాజ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం అన్నదాన మహాప్రసాదాన్ని వితరణ చేశారు.



# హిందూ సమాజ ఐక్యతే దేశానికి శ్రీరామ రక్ష

## అహల్యాబాయి జయంతి సభలో అప్పల ప్రసాద్ జీ



గజ్వేల్ మే 31 మనం న్యూస్ : గజ్వేల్‌లో నిర్వహించిన లోకమాత అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ జీ ముఖ్య అతిథిగా పాల్గొని అహల్యాబాయి హోల్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహల్యాబాయి హోల్కర్ ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ మానసిక దృఢత్వంతో ప్రజలనే తన కుటుంబంగా భావించి ముప్పై మూడు సంవత్సరాలు రాజ్యాన్ని సమర్థవంతంగా పరిపాలించారని గుర్తు చేశారు. హిందూ సమాజం ఐక్యంగా ఉంటే భారతదేశం మరింత పటిష్టంగా ఉ ంటుందని పేర్కొన్నారు. కులాలు వేర్వేరు అయినప్పటికీ మనుషులంతా ఒక్కటేనని, పిల్లల్లో దేశభక్తి, దైవభక్తి పెంపొందించాలని పిలుపునిచ్చారు. సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నరేష్ బాబు మాట్లాడుతూ అహల్యాబాయి హోల్కర్ జీవితం నేటి యువతకు ఆదర్శమని, రైతుల సంక్షేమం కోసం చెరువులు తవ్వించడం, దేవాలయాల నిర్మాణం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆమె "లోకమాత"గా గుర్తింపు పొందారని అన్నారు. సామాజిక సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర మహిళా కన్వీనర్ రుక్మిణి గారు మాట్లాడుతూ మూడు శతాబ్దాల క్రితమే మహిళా శక్తిని ప్రపంచానికి చాటిన మహనీయురాలు అహల్యాబాయి హోల్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సిద్ధు, బింగి స్వామి, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మరాఠీ కృష్ణమూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ హరిణ పవన్, సీనియర్ జర్నలిస్ట్ పి. వెంకటేశం, టీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు జి. నవీన్, వివిధ కుల సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో విశేష సేవలందించిన పలువురిని ఘనంగా సన్మానించారు.

# వడ్లను వెంటనే కొనుగోలు చేయాలి

**వంటేరు ప్రతాప్ రెడ్డి**

## కొనుగోలు సెంటర్ల పరిశీలన



గజ్వేల్, మనం న్యూస్, మే 31 : వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని గజ్వేల్ మండలంలోని, శ్రీగిరి పల్లి, అక్కారం, రిమ్మనగూడ, కొడకండ్ల, బూరుగుపల్లి, అందిపూర్, పిడిచేడ్, దిలాల్పూర్, ధర్మ రెడ్డిపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ఐకెపి, పిఎసిసి సెంటర్ లను గజ్వేల్ నియోజకవర్గ బిఆరెస్ పార్టీ ఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరియు అధికారులు వెంటనే స్పందించి రైతుల ధాన్యం వెంటనే కొనుగోలు చేయకపోతే, వరి ధాన్యం నింపిన ట్రాక్టర్లతో రాజీవ్ రహదారి దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. గజ్వేల్ నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాలలో రైతులు రెండు మాసాలుగా వడ్లు 45 డిగ్రీలు ఎండలో ఎండబెట్టిన వరి ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో వర్షాలకు నాని రైతులు ఇబ్బందులు పడుతున్నారన, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపు లేక సరియైన సమయానికి గన్ని బ్యాగులను సమకూర్చలేక , లారీలు, ట్రక్కులను పంపియక, కాంటా పెట్టడంలో ఆలస్యమై రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రమైన ఇబ్బందులు పెడుతుందని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ గారి ప్రభుత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో జిల్లాలో హరీష్ రావు గారితో రివ్యూ మీటింగ్ పెట్టుకొని ఆర్డీవో , ఎమ్మార్వో, ఎంపీటీసీ జెడ్పిటిసిలు ఎమ్మెల్యేలు అందరు కలిసి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని సేకరించి సకాలంలో కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు వేశామని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలలో రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, రైతులను పట్టించుకునేవారు లేరు అని, ఇప్పటివరకు కలెక్టర్, ఆర్డిఓ, ఎమ్మార్వోలు, రివ్యూ మీటింగ్ పెట్టిన దాఖలాలు లేవని, పట్టించుకోవడంలేదని తెలిపారు, జిల్లా మంత్రికి ఇన్చార్జిమంత్రికి వడ్లను కొనుగోలు చేసే ప్రక్రియలో మొద్దు నిద్రలో ఉన్నారని మండిపడ్డారు, అసలు రాష్ట్రంలో ఏం జరుగుతుందో తెలువది, ముఖ్యమంత్రి 80 శాతం వడ్లను కొనుగోలు చేశామని చెప్పడం చాలా దారుణం, ఇంకా వడ్ల కొనుగోలు కేంద్రాలలో 70% వడ్లు అలానే ఉన్నాయని తెలిపారు, సివిల్ సప్లై మినిస్టర్ ఉత్తంకుమార్ గారిమో 50 లక్షల మెట్రిక్ క్వింటాల్ ధాన్యం కొన్నామని ఉత్తంకుమార్ రెడ్డి చెప్తున్నారని,దిగుపదేమో 1 కోటి 44 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చింది అని,మిగిలిన 94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎవరు కొనాలి అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం దుర్మార్గపు పాలన చేస్తుందని ఏ సెంటర్లో చూసిన రైతుల గోస వినిపిస్తుందని, దేశాన్ని రక్షించేవాడు జవాన్ అయితే దేశంలో ఉ ండే140 కోట్ల మందికి అన్నం పెట్టే రైతన్నను ఏడిపిస్తున్నటువంటి ప్రభుత్వం ఈ రేవంత్ రెడ్డి అని అన్నారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వము రెండు ఒక్కటై రైతుల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. ఎంపీ రఘునందన్ రావు మైకులకు మాత్రమే సరిపోతాడని, రైతుల గోసలు పట్టవని ఎక్కడికి రాడు పేపర్లల్లా టీవీలల్ల ఫోజులిచ్చుడు ఆయన పని ఆయన చేసుకుంటుండు రైతుల కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వానికి పట్టదు అన్నారు. రైతుల పంటలను కొనుగోలు చేయలేని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గద్ద దిగాలి రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జూన్4 తారీఖు నాడు , కొండపాక కుకునూరుపల్లి గజ్వేల్, జగదేవ్పూర్, వర్గల్, ములుగు రాజీవ్ రహదారిపై వడ్లు పోసి రాజీవ్ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, అక్కారం సర్పంచ్ బాలచంద్రం, మాజీ జెడ్పిటిసి బొల్లారం ఎల్లయ్య, మద్ది రాజిరెడ్డి, మురళి,మాజీ ఎంపీటీసీ అశోక్, భాస్కర్, రాజు, అబ్దుల్, అహ్మ, రమేష్ గౌడ్, రవీందర్ రెడ్డి, నిజాం, శివకుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## నేత్రదానం మరొకరికి చూపు కల్పించడం

గజ్వేల్ మే 31 న్యూస్. నేత్రదానం చేయడం వల్ల మరొకరికి చూపు కల్పించిన వారు అవుతామని ఆర్యవైశ్య సంఘం నాయకులు కొమురవెల్లి దేవస్థానం మెంబర్ నంగునూరి సత్యనారాయణ అన్నారు. గజ్వేల్ పట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అమర నాగేందర్ ఆదివారం ఉదయం అకస్మాత్తుగా గుండెపోటుతో మృతిచడం జరిగింది. ఇంటి వద్ద అమర నాగేందర్ నేత్రాలను సేకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మృతి చెందిన వ్యక్తి యొక్క నేత్రాలను దానం చేయడం వలన ఇంకొకరికి నేత్రదానం చేయడం జరుగుతుంది అని వారికి చూపు ఇచ్చిన వారవుతారు అన్నారు. ఇంటి యజమాని మృతి చెందిన బాధలో ఉన్నప్పటికీ కూడా వారి కుమారులు నిఖిల్ నేత్రదానానికి ఒప్పుకోవడంతో కంటి ఆసుపత్రి సిబ్బంది నేత్రాలు సేకరించడం జరిగిందని వారి కి ఇది తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్ పట్టణ పరిసర ప్రాంతంలో కానీ పట్టణంలో కానీ ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోలి సంతోష్, తోట బిక్షపతి,జగ్గయ్య గారి రాజు, రమణ,సిద్ది రామచంద్రం తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నంగునూరి సత్యనారాయణ



గజ్వేల్ మే 31 మనం న్యూస్ : గజ్వేల్ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సీనియర్ నాయకులు, కొమరవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియామకమయ్యారు, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు కటకం శ్రీనివాస్ చేతుల మీదుగా ( ఐ హెచ్ ఆర్ సి) ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియామక పత్రం అందుకున్నారు, ఈ సందర్భంగా కటకం శ్రీనివాస్ మాట్లాడుతూ నంగునూరు సత్యనారాయణ రాజకీయ రంగంలో రాణిస్తూ సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు, వారికి ఐ.హెచ్.ఆర్.సి.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పదవి ఇవ్వడం జరిగిందని అన్నారు, అనంతరం నంగునూరు సత్యనారాయణ మాట్లాడుతూ, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ, మానవ హక్కుల కోసం ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా ద్వారా ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని తెలిపారు.

## చైల్డ్ లేబర్ , బాండెడ్ లేబర్ నిర్మూలనకు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

**సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్**



సంగారెడ్డి మే 31 మనం న్యూస్ ప్రతినిధి : చైల్డ్ లేబర్ ,బాండెడ్ లేబర్ నిర్మూలనకు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ అన్నారు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడా లో గల వివి గిరి లేబర్ ఇనిస్ట్యూట్ లో మే 25 నుండి 29 వరకు చైల్డ్ లేబర్ మరియు బాండెడ్ లేబర్ నిర్మూలన కార్యక్రమాలపై జాతీయ స్థాయి ట్రైనింగ్ ప్రోగ్రాం లో సిఐటియు కార్మిక సంఘం ప్రతినిధిగా నేను పాల్గొనడం జరిగిందని అతిమేల మానిక్ గారు అన్నారు. ఈ అవకాశం సిఐటియు కేంద్ర, రాష్ట్ర కమిటీలు కల్పించాయని అన్నారు. వివిధ రాష్ట్రాల నుండి చైల్డ్ లేబర్ బాండెడ్ లేబర్ నిర్మూలనకు కృషి చేస్తున్న సంస్థల ప్రతినిధులు ప్రముఖులు విద్యావేత్తలు సామాజిక వేత్తలు హాజరైనారని అన్నారు. ఈ రంగంలోని అనుభవజ్ఞులైన నిపుణులు పాల్గొని అవగాహన కల్పించాలని అన్నారు.. స్వాతంత్రం వచ్చి 80 ఏండ్లు గడిచిన నేటికీ దుర్మార్గమైన చైల్డ్ లేబర్ మరియు బాండెడ్ లేబర్ వ్యవస్థ కొనసాగుతుందని అన్నారు. చైల్డ్ లేబర్ నిషేధిస్తూ 1986లో చట్టం వచ్చిందని దానిని 2016లో సవరణ చేశారని అన్నారు రాజ్యాంగంలోని ఆర్టికల్ 24 ప్రకారం బాల కార్మిక వ్యవస్థను నిషేధించింది ఆర్టికల్ 21 (ఏ ) ప్రకారం 14 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య అందించాలని చెప్పింది. బడి మెట్లు ఎక్కని పిల్లలు అనేక మంది ఉ న్నారని వారందరూ బాల కార్మిక వ్యవస్థలో మగ్గుతున్నారని అన్నారు. 1976లో బాండెడ్ లేబర్ నిషేధిస్తూ చట్టం వచ్చిందని అన్నారు చట్టాలు ఉన్నా సరిగా అమలు జరగడం లేదని అన్నారు. ఇటుక బట్టీలు, నిర్మాణరంగం, ఫ్యాక్టరీలు, గనులు, హోటల్లు ,మాల్స్ లలో చైల్డ్ మరియు బండెడ్ లేబర్ పెట్టుకొని దోపిడీ చేస్తున్నారని అన్నారు. వీరి మీద అనేక అగ్రిత్యాలు జరుగుతున్నాయని ముఖ్యంగా లైంగిక వేధింపులు బెదిరింపులు మోసాలు దోపిడీలు మానవ అక్రమ రవాణా వంటివి జరుగుతున్నాయని అన్నారు. లేబర్ చైల్డ్ వెల్ఫేర్ పోలీస్ డిపార్మెంట్స్ ఎన్జీవోలతో భాగస్వామ్యంతో బాల , బాండెడ్ లేబర్ ను విముక్తి ప్రణాళికలు వేయాలని చైల్డ్ లేబర్ బాండెడ్ డ్ లేబర్ వినియోగిస్తున్న యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ జనరల్ ప్రోగ్రాం డైరెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేశారు.

## యువత, సామాజిక సేవల్లో చురుగ్గా పాల్గొనాలి

**తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గం ఇన్ చార్జ్ దయాకర్ రెడ్డి**

సంగారెడ్డి మే 31 మనం న్యూస్ ప్రతినిధి : యువత రాజకీయాల్లో, సామాజిక సేవల్లో చురుకుగా పాల్గొనాలని తెలంగాణ రక్షణ సేన సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ దయాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు సదాశివపేటలో నిర్వహించిన కార్యక్రమంలో యువకులు పెద్ద ఎత్తున తెలంగాణ రక్షణ సేవలో నియోజవర్గ ఇన్చార్జ్ కల్పగుడు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 మంది యువకులు పార్టీలో చేరి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ కల్వకుంట కవిత నాయకత్వంలో తెలంగాణ ఆత్మ గౌరవం యువత హక్కుల పరిరక్షణ నిరుద్యోగ సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం ,కోసం తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని తెలిపారు. తెలంగాణ రక్షణ సేన చేపడుతున్న కార్యక్రమా లు కవిత నాయకత్వం పట్ల ఆకర్షితులై నాయకులు యువకులు, పెద్ద సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేస్తూ, పంచ ధాన్యం మోగింది. తెలంగాణ గళం లక్ష్యంతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.



## విద్యాధరీ సన్నిధిలో కలెక్టర్ హైమావతి పూజలు



వర్గల్ మే 31 మనం న్యూస్ : ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో జిల్లా కలెక్టర్ హైమావతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో ఆమెను స్వాగతం పలకగా, అనంతరం వేద పండితులు కలెక్టర్ హైమావతిని అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# కృష్ణ భక్తిని ఆస్వాదించాలి


**కంది హరేకృష్ణ ఆలయ బాధ్యులు విభిషణ్ దాస ప్రభుజీ**



జహీరాబాద్ మే 31 మనం న్యూస్: మనిషి తన విద్యుక్త నియమాలను నిర్వహిస్తూనే కృష్ణ భక్తిని ఆస్వాదించాలని సంగారెడ్డి జిల్లా మండలం కేంద్రమైన కంది గ్రామ హరేకృష్ణ ఆలయ బాధ్యులు విభిషణ్ దాస ప్రభుజీ హితవు పలికారు. ప్రతిరోజూ పూజా చేశాకే హరేకృష్ణ జపం కూడా విధిగా అలవరుచుకోవాలని ఆయన చెప్పారు. జహీరాబాద్ హరేకృష్ణ మూమెంట్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పట్టణంలోని విద్యుత్తు కాలనీలో 209వ నగర సంకీర్తన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సత్సంగ సభలో విభిషణ్ దాస్ ప్రభుజీ పాల్గొని, ప్రవచించారు. ధర్మ బద్ధంగా తన నిజ జీవిత కార్యకలాపాలు నిర్వహిస్తూనే ఆధ్యాత్మికత వైపు దృష్టి సారించాలని సూచించారు. కలికల్మష నాశనానికి హరేకృష్ణ మహామంత్రమే ఉత్కృష్టమైనదని చెబుతూ రోజుకు కనీసంగా ఒక్క మాల అయినా జపించాలని సూచించారు. తద్వారా మనిషికి శాంతి, ఇతరుల పట్ల దయార్ద్ర హృదయం కలిగిన వారై ఉంటారని అన్నారు. కృష్ణ భక్తి భావన ఒక్కటే సర్వ బాధలనుండి విముక్తులను చేస్తుందని తెలిపారు. అంతకుముందు విద్యుత్తు కాలనిలోని వీధుల్లో సంకీర్తన చేస్తూ, గొప్ప శోభాయాత్ర నిర్వహించారు. 31వ వివాహ వార్షికోత్సవం జరుపుకొంటున్న నగర సంకీర్తన బృందం సభ్యుడు సంజీవ రెడ్డి – స్వరూప రాణి దంపతులకు విభిషణ్ దాస ప్రభుజీ ఆశీస్సులు అందజేశారు. నరసింహ ఆరతితో కార్యక్రమం ముగించగా స్వస్తిక్ రెస్టారెంట్ యాజమాన్యం ప్రసాద వితరణ చేసింది.

### హుగ్గెల్లిలో అట్టహాసంగా పల్లె సంకీర్తన

ఇదిలా ఉండగా జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామంలోనూ ఆ గ్రామ హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో 178 వ పల్లె సంకీర్తన అట్టహాసంగా జరిగింది. గ్రామ హనుమాన్ మందిరం నుండి ప్రారంభమైన శోభాయాత్ర గ్రామ ప్రధాన వీధుల గుండా సాగి తిరిగి మందిరానికి చేరుకొంది. శోభాయాత్ర అసాంతం భక్తి భావనలో కొనసాగింది. కృష్ణ కీర్తనలు పాడుతూ సాగిన శోభాయాత్ర లో చిన్నారులు చేసిన నృత్య అభినయం గ్రామస్థులను కట్టిపడవేసింది. ప్రభుపాదుల వారి ప్రార్థనతో ప్రారంభమైన సంకీర్తన నర్సింహా ప్రణామంతో ముగిసింది.



## ఉద్యోగ విరమణ పొందిన జహీరాబాద్ మున్సిపల్ కమీషనర్ జైత్రామ్‌కు సన్మానం

**హాజరైన పిఆర్ టియు టిఎస్ సంగారెడ్డి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టరు తులసిరామ్ రాథోడ్**

జహీరాబాద్ మే 31 మనం న్యూస్: జహీరాబాద్ మున్సిపల్ కమీషనరుగా విధులు నిర్వహిస్తూ, ఆదివారంనాడు పదవీవిరమణ పొందిన జైత్రామ్ నాయక్ కు పిఆర్ టియు టిఎస్, టీబేస్ నాయకులు కలసి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పలువురు ప్రసంగిస్తూ మున్సిపల్ కమిషనర్ గా జాతీరామ్ నాయక్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన వివిధ హోదాల్లో సుమారుగా 35 సంవత్సరాల పాటు మున్సిపల్ ఉద్యోగం చేయడం ఎంతో గర్వించదగ్గ విషయం అన్నారు. ఆయన శేష జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ టియు టిఎస్ సంగారెడ్డి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టరు తులసిరామ్ రాథోడ్, టీబేస్ జహీరాబాద్ డివిజన్ అధ్యక్షులు రమేశ్ బానోత్, డివిజన్ ప్రధాన కార్యదర్శి జైసింగ్ చవ్హాణ్ తో పాటు పిఆర్ టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డి శ్రీనివాస్, డి విఠ్ఠల్, బాలయ్య, పిఆర్ టియు టిఎస్ జహీరాబాద్ టౌన్ అధ్యక్షులు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి తుకారామ్ చవ్హాణ్, పిఆర్ టియు టిఎస్ జహీరాబాద్ రూరల్ అధ్యక్షులు బాగయ్య, ప్రధాన కార్యదర్శి అశోక్, పిఆర్ టియు టిఎస్ న్యాల్ కల్ మండల అధ్యక్షులు మురళీధర్, ప్రధాన కార్యదర్శి పాండయ్య, పిఆర్ టియు టిఎస్ నాయకులు కిషన్ చవ్హాణ్,వేంకటేశం, బీరయ్య, వెంకటేశ్వర్లు, హన్మంత్ పవార్, శేఖయ్య,సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.






## మృతుని కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

వర్గల్ మే 31 మనం న్యూస్: ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త చాకలి కుమార్ కుటుంబ సభ్యులను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుమ్ముకుంట నర్సారెడ్డి ఆదివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి మనోధైర్యం కల్పించారు. ఆయనతోపాటు మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పొన్నాల నర్సిరెడ్డి, ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రభుదాస్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, నందు లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



# ట్రిపుల్ ఐటీకి 13 మంది ఎంపిక

నంగునూరు, మే 31 మనం న్యూస్:- సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నుంచి 13 మంది విద్యార్థులు మొదటి విడత జాబితాలో ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. మొదటి విడత జాబితాను శనివారం సాయంత్రం విడుదల చేశారు. ఈ జాబితాలో నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 74 మందికి ఏడుగురు, నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 76 మంది విద్యార్థులకు ముగ్గురు, మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 24 మంది విద్యార్థులకు ఇద్దరు, గట్లమల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 27 మంది విద్యార్థులకు ఒక్కరు ఎంపికయ్యారని మండల విద్యాధికారి పురుమాండ్ల శ్రీనివాస రెడ్డి తెలిపారు. నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బొమ్మిడి అమూల్యా రెడ్డి, రేకులపల్లి జశ్విత, వడ్లకొండ అక్షయ, కలకుంట్ల శ్రీజ, నార్లపురం ఆకాంక్ష, రేకులపల్లి సాత్విక్ రెడ్డి, నాయిని అశ్విత, నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి విభూతి అక్షయ, గౌరబోయిన వైష్ణవి, వడ్డేపల్లి నిహారిక, మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి దేవర అశ్వంత్, పాకాల యశ్వంత్, గట్లమల్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బానోతు అశ్విని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరికి జూన్ 5, 6, 8 తేదీలలో కౌన్సిలింగ్ నిర్వహించి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. ఈ కోర్సులో రెండేళ్ల పీయూసీ(ఇంటర్మీడియట్), నాలుగేళ్ల బీటెక్ కోర్సు ఉంటుంది. పీయూసీ లో సాధించిన కోర్సు ఆధారంగా మూడవ సంవత్సరం ప్రారంభంలో బీటెక్ బ్రాంచ్ కేటాయిస్తారు. ట్రిపుల్ ఐటీలో చేరిన అభ్యర్థులకు ఉచిత విద్యతో పాటు కార్పొరేట్ స్థాయి ఉచిత వసతి ఉంటుంది. మొదటి జాబితాలో భర్తీ కాకుండా మిగిలిన సీట్లను రెండవ విడతలో భర్తీ చేస్తారు.





# ఆరోగ్య కార్డులపై ప్రభుత్వ వైఖరి సరైంది కాదు



నంగునూరు, మే 31 మనం న్యూస్:- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఉద్యోగ,ఉపాధ్యాయుల చిరకాల వాంఛ ఆరోగ్య కార్డుల విషయంలో పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ట్రస్ట్ ఏర్పాటు చేయక ముందే మూల వేతనం 1.5 శాతం తగ్గించడం సరైన చర్య కాదని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లు ఇంద్రసేనారెడ్డి, ఆదరాసుపల్లి శశిధర శర్మ పేర్కొన్నారు. ఆదివారం నంగునూరు మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్య పథకం ప్రారంభం కాకముందే ప్రభుత్వం వేతనం తగ్గింపు చేయడం ఏకపక్ష నిర్ణయమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఈ నిర్ణయం తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. వేతన చెల్లింపు అధికారు(డీడీవో)లకు కూడా తెలియకుండా తగ్గించడం దుర్మార్గమైన చేయగా పేర్కొన్నారు. ఈ చర్య ఉద్యోగ ఉపాధ్యాయులను వంచించడమేనన్నారు. ఎలాంటి మార్గదర్శకాలు లేకుండా, అసలు ఆరోగ్య పథకం ప్రారంభం కాకముందే వేతనాలలో కోత విధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఈ ట్రస్టులో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సాధారణ ఉద్యోగులను సభ్యులుగా చేర్చుతామని చెప్పారని తెలిపారు. ఆ తర్వాత విధి విధానాలు ప్రకటిస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత మాత్రమే ఉద్యోగుల మూల వేతనంలో 1.5 శాతం మినహాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ ప్రక్రియ జరగకుండానే,ఉద్యోగ ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వకుండా, కనీసం హఠాత్తుగా ఉద్యోగుల మే నెల వేతనాల మూల వేతనంలో 1.5శాతం మినహాయించుకోవడం ఉద్యోగులను మోసం చేయడమేనన్నారు. కనీసం డీడీవోలకు కూడా సమాచారం లేకుండా వేతనాల్లో కట్ చేయడం ఉద్యోగ ఉపాధ్యాయుల హక్కులను హరించడమేనని విమర్శించారు. ఏయే ఆసుపత్రులలో, ఏయే వ్యాధులకు ఈ పథకం వర్తిస్తుంది? ఆరోగ్య కార్డుకు అర్హులయ్యే కుటుంబ సభ్యులు ఎవరెవరు అర్హులు? ఎలాంటి సౌకర్యాలు ఉంటాయి? వంటి వివరాలు రాత పూర్వకంగా ఇచ్చిన తరువాతే ఉద్యోగుల మూల వేతనం నుంచి మినహాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన డిఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లుల మాట పక్కన పెట్టి, ఎలాంటి విధి విధానాలు లేకుండా ఉద్యోగుల మూల వేతనం 1.5 శాతం ఆరోగ్య కార్డుల పేరిట తగ్గించడం అసమంజసమని పేర్కొన్నారు.



# అల్గోల్ బైపాస్‌లో వెలగని హైమాస్ట్ లైట్లు, వాహన చోదకులకు ఇక్కట్లు



జహీరాబాద్ మే 31 మనం న్యూస్: జహీరాబాద్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారి భారత్ నగర్, అల్గోల్ బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు పనిచేయక పోవడంతో రాత్రి వేళల్లో ఆ ప్రాంతమంతా చీకటిగా మారుతోంది. జాతీయ రహదారిపై కీలక కూడలిగా ఉన్న ఈ ప్రాంతంలో తగినంత వెలుతురు లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్గోల్ బైపాస్ క్రాస్‌రోడ్డు వద్ద నిత్యం భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, లైట్లు వెలగకపోవడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం సంభవించిన సంఘటనలు చోటు చేసుకున్నాయని వారు గుర్తు చేస్తున్నారు. ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు పనిచేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు సకాలంలో స్పందించి హైమాస్ట్ లైట్లను మరమ్మతు చేసి, రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలిగించే విధంగా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



# ఎంఇఓ వేంకటేశంకు పిఆర్టీయూ టిఎస్ సన్మానం

జహీరాబాద్ మే 31 మనం న్యూస్: మొగుడంపల్లి మండల నూతన ఎంఇఓగా పదవి బాధ్యతలు చేపట్టిన వేంకటేశంకు పిఆర్ టియు టిఎస్ నాయకులు కలసి ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంత వరకు ఇక్కడి ఎంఇఓగా బాధ్యతలు నిర్వహించిన మొహమ్మద్ జాఫర్ అలీకి కూడా ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. మొగుడంపల్లి మండల నూతన ఎంఇఓకు సన్మానించిన వారిలో పిఆర్ టియు టిఎస్ సంగారెడ్డి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టరు తులసిరామ్ రాథోడ్, పిఆర్ టియు టిఎస్ మొగుడంపల్లి అధ్యక్షులు అర్జున్ చవ్వాణ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, పిఆర్ టియు టిఎస్ జహీరాబాద్ అర్బన్ అధ్యక్షులు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి తుకారామ్ చవ్వాణ్, పిఆర్ టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డి శ్రీనివాస్, డి విట్టల్, అసద్ గంజ్ జీహెచ్ఎం తుల్జా బాయితో పాటు పిఆర్ టియు టిఎస్ నాయకులు శ్రీనివాస్, జితేందర్ ప్రభు,శేఖయ్య, దళ్ సింగ్ రాథోడ్,జి రమేశ్, బాబు, మదన్ మోహన్, బిఆర్ పి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# అంబరాన్నంటిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్వర్ణోత్సవాలు



హుస్నాబాద్ జూన్ 1 మనం న్యూస్ : హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బాయ్స్ 1996--2016 పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాలు అంబరాన్నంటాయి. కొంత కాలం తరవాత తమ క్లాసులోని పూర్వ విద్యార్థులు ఆదివారం..... తిరుమల పంక్షన్ హాల్లో కలుసుకున్నారు. తమకు విద్యా బుద్దులు నేర్పిన గురువులకు గురు భక్తితో శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. తమ బాల్యాన్ని నెమరేసుకున్నారు. చిన్నతనం వారు క్లాసు రూములో చేసిన అల్లరి, ఉపాధ్యాయుల తిన్న బెత్తం దెబ్బలను గుర్తు చేసుకొని మురిసిపోయారు. 1996--2016 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హుస్నాబాద్ పట్టణంలో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. దాదాపు 20 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేలా మార్గనిర్దేశం చేసిన గురువులను పూలతో, శాలువాలతో ఘనంగా సన్మానించి కరతాళధ్వనులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి సుమారు 70 మంది ఉపాధ్యాయులు, 600 మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. గురుకుల విద్యాలయాలు జీవితాల్లో వెలుగులు నింపాయి -3సీఐ కన్నం మధు ముఖ్య అతిథిగా పాల్గొన్న గచ్చిబౌలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కన్నం మధు మాట్లాడుతూ, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాయని అన్నారు. గురుకుల విద్య వల్లే తాను సమాజంలో మంచి స్థాయికి ఎదగగలిగానని, హుస్నాబాద్ గురుకులంలో గడిపిన రోజులు తన జీవితంలో మరపురాని జ్ఞాపకాలుగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు గురుకుల విద్య తమ జీవితాలపై చూపిన ప్రభావాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనం స్నేహబంధాలను మరింత బలోపేతం చేస్తూ అందరికీ గుర్తుండి పోయేలా హుస్నాబాద్ గురుకుల పాఠశాల బాయ్స్ విద్యార్థుల మరో చరిత్రగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డా. వీ. కుమార్ (అసిస్టెంట్ ప్రొఫెసర్), కన్నం మధు (ఆర్.ఐ.), రమేష్ (ఎస్.ఐ. బెటాలియన్), అంజి (ఎస్.ఐ. ట్రాఫిక్), రాజు (ఎస్.ఐ. పోలీస్), నరేష్ (ఇండియన్ కోచ్, వరల్డ్ కప్ కోచ్), డా. వీ. సురేందర్ (పీడీ), వి. స్వామి (ఉపాధ్యాయుడు), సురేందర్ నాయక్ (ఏఈఓ), వి. మహేందర్ (లెక్చరర్), కట్టా సంపత్ (సాఫ్ట్‌వేర్ ఉద్యోగి), కన్నం కోటేష్, ప్రభాకర్,రాజు, రవీందర్ సత్యం,పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.





## బీఆర్ఎస్ తెలంగాణ అభివృద్ధి యువత, రైతు సంక్షేమం కోసం కృషి

**కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లో చేరిక**

**మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి**

చౌటుప్పల్, మే 31(మనం న్యూస్) : బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ అభివృద్ధి, యువత, రైతు సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తుందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం గ్రామానికి చెందిన 40 కాంగ్రెస్ కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. ఆ గ్రామ సర్పంచ్ గిర్కటి నిరంజన్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామ కన్వీనర్ ముదిగొండ వెంకటేశ్‌ల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు, మండల కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఈడ్దుల విజయ్‌కుమార్‌తోపాటు మరో 40 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్‌పార్టీకి ప్రజలను మోసగించడం తప్ప అభివృద్ధిలో శూన్యమని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ఆకర్షితులై యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దండుమల్కాపురం గ్రామ సర్పంచ్ గిర్కటి నిరంజన్‌గౌడ్ మాట్లాడారు. గ్రామంలో బీఆర్ఎస్ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. గ్రామంలోని యువత బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరినవారిలో మాసిన కిష్టయ్య, పగిళ్ల నరేశ్, రాచర్ల సందీప్, మాసిన మల్లికార్జున్, గొలుసుల గిరి, మాసిన శ్రీశైలం, బసిరెడ్డి మల్లారెడ్డి, మాసిన రమేశ్, చింతపట్ల రాజశేఖర్, రాసాల మహేశ్, వాడపల్లి వజ్రేశ్, గొలుసుల శివ, శ్రీశైలం, పగిళ్ల ఉపేందర్, పి.మహేందర్, డాకోజు వంశీ, శశి, సుశాంత్, సింగనమణి బన్నీ, గోపి వంశీ, మధు, గోళి శివమణి, ఈడ్దుల వంశీ, రుద్రారం శివ, చిట్టెంపల్లి జగన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కొయ్యడ శేఖర్‌గౌడ్, మల్కాపురం మాజీ ఉపసర్పంచ్ మల్కాజిగిరి కృష్ణ, వార్డుసభ్యులు ఈడ్దుల రామ్‌ప్రసాద్, పొట్లపల్లి శివకుమార్, కొత్త మహేశ్, చిట్టెంపల్లి సాయికుమార్, సంగం నర్సమ్మచంద్రయ్య, జొన్నకంటి మల్లేశ్ పాల్గొన్నారు.

## జహీరాబాద్ మున్సిపల్ కమీషనరుగా ప్రభాకర్ యాదవ్



జహీరాబాద్ మే 31 మనం న్యూస్: జహీరాబాద్ మున్సిపల్ నూతన కమిషనరుగా డిప్యూటేషన్ పై ప్రభాకర్ యాదవ్ ను నియమిస్తూ ఆ శాఖ మున్సిపల్ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఉద్యోగంలో చేరిన తర్వాత ప్రభాకర్ మొదటి పోస్టింగ్ సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో బిల్లు కలెక్టరుగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి పొంది మెదక్ మున్సిపాలిటీలో బాధ్యతలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ సీనియర్ నాయకులుగా పదోన్నతి పొంది మెదక్, జహీరాబాద్ మునిసిపాలిటీల్లో పనిచేశారు. అనంతరం జడ్చర్ల మున్సిపల్ లో కూడా ఆర్ఓగా పనిచేశారు. జవహర్ నగర్ మున్సిపాలిటీలో కూడా పనిచేశారు. ప్రస్తుతం పటాన్ చెరువులోని తెల్లాపూర్ మున్సిపల్ నుంచి జహీరాబాద్ కు మున్సిపల్ మేనేజరుగా బదిలీపై వచ్చిన ఆయన డిప్యూటేషన్ పై మున్సిపల్ కమిషనరుగా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారని తెలిసింది.

## పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా రైతు భరోసా భీమా పథకం

**సంవత్సరానికి 250 చెల్లిస్తే పాడి రైతు భరోసాకు అర్హత**

**27మందికి 13లక్షల 50వేల విలువగల పాడిరైతు భరోసా చెక్కుల పంపిణీ**

**ప్రతి ఇంటికి ఒక గేదెను పెంచుకోవాలన్న కరీంనగర్ డెయిరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వర్ రావు**



హుస్నాబాద్ జూన్ 1 మనం న్యూస్ : హుస్నాబాద్:పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా కరీంనగర్ డెయిరీ పాడి రైతు భరోసా భీమా పథకం అమలు చేస్తుందని,ప్రతి రైతు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను పెంపొందించుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని కరీంనగర్ డెయిరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వర్ రావు కోరారు.సోమవారం హుస్నాబాద్ లో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో హుస్నాబాద్,కోహెడ మిల్క్ కూలింగ్ సెంటర్ పరిధిలోని 27మంది లబ్ధిదారులకు 13లక్షల 50వేల రూపాయల విలువ గల పాడి రైతు భరోసా చెక్కులను చైర్మన్ రాజేశ్వర్ రావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వర్ రావు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుడు సంవత్సరానికి 250 చెల్లిస్తే భార్య గాని భర్త గాని మరణిస్తే వారి కుటుంబానికి 50వేల రూపాయలను కరీంనగర్ డెయిరీ తరఫున అందజేస్తామని చెప్పారు. 9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాడి రైతు భరోసా పథకంలో భాగంగా 800రూపాయల చొప్పున స్కాలర్‌షిప్ లు అందజేస్తున్నట్లు చెప్పారు.పాల ఉత్పత్తిదారుడి సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ కరీంనగర్ డెయిరీ ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.కరీంనగర్ డెయిరీ ఏ ఒక్కరి సొంతం కాదని లక్ష పాడి రైతు కుటుంబాల సంస్థ అని,డెయిరీ పరిధిలో ఎక్కడ అవినీతి అక్రమాలు జరిగిన ప్రశ్నించే స్వేచ్ఛ కరీంనగర్ డెయిరీలో మాత్రమే ఉందని పేర్కొన్నారు.మరణం ఎవరికి చెప్పి రాదని ప్రతి పాల ఉత్పత్తిదారుడు వాడ 250చెల్లించి పాడి రైతు పథకంలో చేరాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్లు అంతం నారాయణరెడ్డి, కన్నబోయిన రవీందర్, మేనేజర్లు కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,చింతపూల నాగయ్య,అసిస్టెంట్ మేనేజర్ సింగిరెడ్డి తిరుపతిరెడ్డి,సూపర్ వైజర్లు సిరా కరుణాకర్ రెడ్డి,సీతా రవి,భాస్కర్ రెడ్డి,వీరస్వామి, అప్పాల మల్లయ్య, హుస్నాబాద్ పాలకేంద్రం అధ్యక్షులు కాయిత బాల్ రెడ్డి, సుందరగిరి అధ్యక్షులు పిట్టల తిరుపతి,రామంచ అధ్యక్షుడు కూతురు మల్లారెడ్డి, ఆంజనేయులు, వెంకటస్వామి, పాల ఉత్పత్తిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర సంస్థకు ఇవ్వద్దని మంత్రి రాజనర్సింహాకు వినతి



జహీరాబాద్ మే 31 మనం న్యూస్: మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర సంస్థకు ఇవ్వరాదని కోరుతూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు ఆదివారంనాడు వినతిపత్రం సమర్పించారు. జహీరాబాద్ మధ్యాహ్న భోజన పథకంలో జహీరాబాద్ ఎస్ హెచ్ జి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టరు సిద్ధం ఉజ్వల్ రెడ్డి నేతృత్వంలో వారు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాకు నేరుగా కలిసి, మధ్యాహ్న భోజన పథకం, అక్షయపాత్ర సంస్థకు ఇవ్వనున్న అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. జహీరాబాద్ స్వయం సహాయక బృందాలు అంద్ మధ్యాహ్న భోజన పథకం సంఘాలకు చెందిన మహిళలు గత 15 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారని, అకస్మాత్తుగా ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా వారిని తొలగించి, ఈ పథకాన్ని అక్షయపాత్ర సంస్థకు అప్పగించడంపై వారు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. దీనితో జహీరాబాద్‌లో వంట చేసుకునే మహిళలు తీవ్ర నిరుద్యోగ సమస్యలు ఎదుర్కొన్నారనే విషయాన్ని మహిళా బృందం సభ్యులు డాక్టరు సిద్ధం ఉజ్వల్ రెడ్డి నివాసంలో కలిసి తమ గోడు విన్నవించారు. ఆయన వెంటనే ఈ విషయాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహా దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి కూడా వెనువెంటనే స్పందించి, ఈ విషయం జిల్లా కలెక్టరుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట కేవలం స్వయం సహాయక బృందాల మహిళలతోనే చేయించాలని, జహీరాబాద్ మధ్యాహ్న భోజన సంఘం మహిళలు రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహాకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో సహకరించిన రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టరు సిద్ధం ఉజ్వల్ రెడ్డిలకు మహిళా సంఘాల ప్రతినిధులు తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మూసానగర్ వార్డు కౌన్సిలరు మొహమ్మద్ జమీలుద్దీన్, అశ్విన్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు అపాయింటెడ్ డే ప్రకటించాలని ఎర్రబ్యాడ్జీలతో నిరసన



జహీరాబాద్ మే 31 మనం న్యూస్: ఆర్టీసీ కార్మికులకు అపాయింటెడ్ డే ప్రకటించాలని డిమాండు చేస్తూ, ఎర్రబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్టీసీ సమస్త జేఏసీ పిలుపుమేరకు ఆదివారంనాడు వారు జహీరాబాద్ డిపోలోని ప్రధాన గేటు ముందు కర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. డీపోలో డిమాండ్ డే సందర్భంగా జూన్ 2వ తేదీన అపాయింటెడ్ డే ప్రకటించాలని వారు డిమాండు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ మానిక్, నాయకులు శ్రీనివాస్, ఆర్ వి రావు, సోఫియా, నరేష్, మహమ్మద్ ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.